# తీరని కోరికలు ::

రచన :
శ్రీ వంకదారు సాత్యకిరావు

పచ్చని పైరులతో కలకల్లాడుతూ కనుల పండువగా వృందాగ్రామం. గ్రామము మధ్యనే చక్కని ఉద్యానవనము. వసంతకాలంలోని చల్లని మలయమారుతము, ఉద్యానవనంలోని సుగంధపుష్పాల సౌరభాన్ని కలిపి గ్రామవాసులకు హాయిని కల్పిస్తూవుంది. ప్రక్కనే ప్రవహిస్తున్న తియ్యని సెలయేరు కలకల శబ్దం చేస్తూ ప్రవహిస్తుంటే, ఆధ్వనితో పాటే పక్షులు సుమధుర సంగీతాన్ని కలిపి వినిపిస్తున్నవి.

ఉద్యాననవనంలో గులాబీచెట్టుప్రక్కనే శిలాఖండంమీద కూర్చుని 'గౌరి' ఆకాశంలో ఎగిరిపోయే పావురాలవంక చూస్తూవుంది. ఆమె అలా ఎందుకుచూస్తుందో ? విదేశాలకు వెళ్ళిన తనప్రియుడు ఆ పావురాలద్వారా ఏమైనా సందేశాన్ని పంపుతాడేమోనని ఆమె ఆశ! చరిత్రల్లో పావురాలద్వారా ప్రేయసీ ప్రియుల ప్రేమలేఖలు రవాణా జరుగుతూ వుండేవని ఆమె చదివింది.

అకస్మాత్తుగా ఆమె తనదృష్టిని గులాబీ చెట్టుపైకి ప్రసరింపజేసింది. ప్రకృతి తనవంక చూసి హేళనగా నవ్వుతోంది. ప్రకృతితో పాటు ఆమెకూడా విప్పారిన గులాబీపువ్వులా మొఖాన్ని వికసింపజేసింది. రెండుతుమ్మెదలు గులాబీ పూవులోని మకరందాన్ని త్రాగటానికివచ్చి విఫలులై తిరిగి వెళ్లిపోయినవి. ఇంతలో రెండు తేనెటీగలు గబగబావచ్చి గులాబీపువ్వుపై వ్రాలినవి.

"గౌరీ! మీ పావురమింకా సందేశాన్ని తేలేదా ?" అని అనేసరికి గౌరి వెనుదిరిగి చూసింది. ఆమె స్నేహితురాలు సరళ పకపకా నవ్వుతూ నిలబడింది.

"వసంతఋతువు వచ్చింది. కాని నా పావురమింకా రాలేదు. తన స్నేహితులతో ఆడుకొంటూ విదేశాలలోనే వుండిపోయిందేమో ?" అంది సరళ.

"లేదు! త్వరలోనే వారు తిరిగివస్తారు. నా ముద్దులపావురము దివ్యసందేశాన్ని తప్పకుండా తీసుకువస్తుంది" అంది గౌరి.

"ఎప్పుడొస్తుందో, ఏమో !" అని సరళ వెళ్ళిపోయింది.

గౌరీ నిరీక్షిస్తున్న ప్రియుడింకా లభ్యం కాలేదు. నిరాశజెందింది. ఆ నిరాశతో మేల్కొంటూనే స్వప్నాలు కంటోంది.

"అది హిందూదేశంలోని సుప్రసిద్ధమైన నగరంలో ఒక చిన్నబజారు. ఆ బజారులో యువకుడొకడు భుజాన మూటపెట్టుకొని అమ్ముకొంటూ తిరుగుతున్నాడు. తిండిలేకుండా కష్టపడటంవల్ల అతనిమొఖం వివర్ణమైపోయింది. చినిగినచొక్కా, చింపిరిజుట్టూ, కాళ్ళకరిగిపోయిన చెప్పులజోడుతో తిరుగుతూ, తిరుగుతూ అలసిపోయి ఒక ఇంటిముందు కూర్చున్నాడు. తన మూటలోనిదేదో కొద్దిగా అమ్ముకొని ఆ పూటకేదో నాలుగుమెతుకులు తినాలని యాతనివుద్దేశ్యం; కాని ఆ గృహస్థు చాలా కఠినంగా మాట్లాడుతున్నాడు.

"ఏయ్! ఇస్తే అరువిచ్చి వెళ్లు. లేకపోతే ఫో!" అంటున్నాడు.

"నాదగ్గర అరువిచ్చే సామర్థ్యంలేదు" అన్నాడు యువకుడు.

"అయితే నాకేమీఅక్కర్లేదు. వెళ్లిపో!" అన్నాడు గృహస్థు.

ఇది గౌరిస్వప్నం. ఆ స్వప్నంలో కనుపించిన యువకునిపై ఆమెకెంతో జాలికలిగింది. అతనికోసమే ఆమె నిరీక్షిస్తూ పగటికలలు కంటోంది.

ఈవిధంగా కొన్నిమాసాలు జరిగిపోయినవి. ధనవంతుడైన ఒక సర్దారుతో గౌరి వివాహం జరిగిపోయింది. మరల వసంతకాలము వచ్చేసింది. యువతీ యువకుల హృదయాలలో ఆనందవీచికలు పరుగులెత్తుతున్నయ్!

ఆ రోజున బలహీనమైన యువకుడొకడు భుజాన మూటనొకదాన్ని పెట్టుకొని తిరిగి అమ్ముకొంటూ, అమ్ముకొంటూ గౌరి యింటి ముందు మూటదింపాడు. మెల్లిగా మూటలోని వస్తువులన్నీతీసి బయటపెడ్తున్నాడు. గౌరి ఆ వ్యాపారస్తుడిని చూసింది. ఆమె హృదయంలో ఏదో ఆవేదన, బాధ బయలుదేరినవి. ఎక్కడో, ఎప్పుడో ఆతనిని చూసినట్లుగా ఏవో గతించినసంగతులామె కళ్ళ ముందు గిర్రున తిరిగినవి. ఆమె నేత్రాలశ్రుపూరితాలయినవి. కంఠం రుద్ధమైపోయింది.

సర్దార్ తన ప్రేయసికీయటానికి ఓవింత వస్తువును బేరమాడుతున్నాడు. యువకుడు మెల్లిగా జవాబు చెప్తున్నాడు.

ఒక వస్తువునుతీసి చేత్తోపుచ్చుకొని "దీని ఖరీదెంత?" అన్నాడు సర్దార్.

"ఇది నాహృదయంతో సమానమైనది. దీనిని వెలకమ్మలేను. మీకు ఉచితంగాయిస్తున్నాను. స్వీకరించండి!" అన్నాడు యువకుడు.

"అయితే నాకక్కరలేదు, తీసుకెళ్ళు. మూట ఇక్కడనుంచి తీసేయ్!" అన్నాడు సర్దార్ కోపంతో.

"మంచిది. వెళ్లిపోతానుబాబూ! చెరువుకెళ్ళి కొద్దిగా మంచినీరు త్రాగివచ్చి తీసుకుపోతాను." అని యువకుడు మూటనక్కడ వదిలి వెళ్ళిపోయాడు. సర్దార్, యువకుడు మరల వస్తాడుగదా అనుకున్నాడు. కాని యువకుడెంతసేపటికీ రాలేదు. రోజులు జరిగిపోతున్నయ్! వ్యాపారి జాడాలేదు. గౌరి హృదయం గాయపడింది. గౌరి వ్యాపారి బరువు తగ్గించిందికాని వెలమాత్రం యివ్వలేదు. వారాలు, నెలలు, వత్సరాలు జరిగిపోయినవి. యువకవ్యాపారి తిరిగి రాలేదు. మరల వసంతఋతువు వచ్చేసిందికాని వ్యాపారి రాలేదు. గౌరి హృదయం వ్యధతో బాధపడుతోంది. "చేతికందిన పావురాన్ని జారవిడుచుకున్నానని" దుఃఖిస్తోంది. ఆమె దుఃఖాన్నివిని వ్యాపారి తిరిగివస్తాడా?

(ఒక హిందీకథ చదివిన తరువాత.)

